క్లుప్తంగా

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బేస్తవారిపేట/గిద్దలూరు రూరల్: డీఎస్సీ ఉచిత శిక్షణకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బేస్తవారిపేట ఏఎస్‌డబ్ల్యూఓ ఈ.రాజేశ్వరమ్మ, గిద్దలూరు ఏఎస్‌డబ్ల్యూఓ ఎం.అమ్మాజి గురువారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవనంలో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తారని, ఈ నెల 21వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులకు ఎంపిక పరీక్ష నిర్వహిస్తారని, వార్షికాదాయం రూ.2.50 లక్షలలోపు ఉండి, ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు అర్హులని స్పష్టం చేశారు.

రాయితీపై శనగ విత్తనాలు



పప్పుశనగ విత్తనాల పంపిణీని పర్యవేక్షిస్తున్న ఏడీఏ

కొనకనమిట్ల: రబీలో శనగ సాగు చేసే రైతులకు 25 శాతం రాయితీపై పప్పు శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఏఓ ప్రసన్న రంగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పెదారికట్ల, చింతగుంట రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతులకు ముందుగా శనగ విత్తనాలు అందజేస్తామని పేర్కొన్నారు. అవసరమైన రైతులు వీఏఏలను సంప్రదించాలని సూచించారు.

బేస్తవారిపేట: బేస్తవారిపేట మండలానికి పప్పు శనగ విత్తనాలు 561 క్వింటాళ్లు కేటాయించినట్లు ఏడీఏ బాలాజీనాయక్ పేర్కొన్నారు. గురువారం నేకునాంబాద్‌లో పప్పుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. విత్తనాలు అవసరమైనవారు వీఏఏలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ జక్కం మెర్సీ, వీఏఏలు పాల్గొన్నారు.

23న మండల పరిషత్ సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

కొనకనమిట్ల: ఈ నెల 23వ తేదీన 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరమ్మ తెలిపారు. మండల అధికారులు పూర్తి నివేదికలతో సమావేశానికి రావాలని స్పష్టం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు, సొసైటీ చైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఎంపీడీఓ గురువారం ఓ ప్రకటనలో కోరారు.


బిల్లులు మంజూరు చేయాలి

గిద్దలూరు రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ కడప లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సర్పంచులు తమ సమస్యలను వివరించారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం మెరుగుదల కోసం చేసిన పనులకు బిల్లులు వెంటనే మంజూరు చేయించాలని వెల్లుపల్లె సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, ఉయ్యాలవాడ సర్పంచ్ భాస్కర్‌రావు, ఓబులాపురం సర్పంచి బొర్రా సుధాకర్‌రెడ్డి కోరారు. గ్రామాల్లో పరిపాలన సక్రమంగా కొనసాగాలంటే ముందుగా చేపట్టిన పనులకు సత్వరమే బిల్లులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ చెన్నారావు, ఉద్యాన శాఖ అధికారి విష్ణుప్రియ, సహాయ సాంఘిక సంక్షేమాధికారి అమ్మాజి, విద్యుత్ ఏఈ వెంకటేశ్వరరావు, పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

19న డయల్ యువర్ డీఎం

గిద్దలూరు రూరల్: ఆర్టీసీ పరంగా ఏమైన సమస్యలు ఉన్నట్లయితే ఈ నెల 19న ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో తెలియజేయాలని స్థానిక డీఎం బి.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధ్యతలు చేపట్టిన మార్కాపురం ఎంపీడీఓ



ఎంపీడీఓ శ్రీనివాసులు

మార్కాపురం రూరల్: మార్కాపురం ఎంపీడీఓగా బి.శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తూ బదిలీపై మార్కాపురంలో నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న తోట చందన గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

విధుల్లో చేరిన తర్లుపాడు ఎంపీడీఓ



చక్రపాణి ప్రసాద్

తర్లుపాడు: మండల నూతన ఎంపీడీఓగా చక్రపాణి ప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా నగరంలో ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై తర్లుపాడు వచ్చారు. పంచాయతీ సెక్రటరీలు, కార్యాలయ సిబ్బంది, ఎంపీడీఓకు స్వాగతం పలికారు.

ఏలికా.. తక్షణమే బాగు చేయాలిక..



గొట్లగట్టులో స్పీడ్ బ్రేకర్ వద్ద రోడ్డుపై గుంతలు



కొమరోలు : గుంతలమయంగా పురుషోత్తమునిపల్లె రహదారి

● గోతుల దారుల్లో వాహనదారుల వెతలు

కొనకనమిట్ల:

వర్షం కురిసిందంటే చాలు కొనకనమిట్ల మండంలోని గొట్లగట్టు బస్టాండ్ సెంటర్లో ఒంగోలు–గిద్దలూరు రహదారిపై రెండు స్పీడ్ బ్రేకర్ల వద్ద నీరు భారీగా నిల్వ చేరుతోంది. కుంటను తలపిస్తున్న రహదారిపై రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో నాణ్యత దెబ్బతింటోంది. హైవేపై ఏర్పడిన గుంతలు వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారి పక్కన మట్టి తీయించి రోడ్డుపై నిలిచిన నీటిని బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఇలాగైతే నడిచేదెట్టా..

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. ముఖ్యంగా గనివానిపాడులో వర్షం వస్తే చాలు వీధులన్నీ జలమైపోతాయి. నడవటానికి కూడా ఇబ్బందులు పడవలసి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. మూడు రోజులుగా ప్రధాన రహదారిలో మోకాలి లోతున నీరు ఉండటంతో ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. అలాగే వాగుమడుగు నుంచి గనివానిపాడు వెళ్లే రోడ్డులో తారు లేచిపోయి కంకర తేలింది. అడుగుకో గుంత ఏర్పడటంతో ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నారు.



గొట్లగట్టు స్పీడ్ బ్రేకర్ వద్ద నీటి తటాకం

ఈ దారిలో నరక యాతనే..

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని పురుషోత్తమునిపల్లెకు ఎవరైనా వెళ్లాలంటే నరక యాతన అనుభవించాల్సిందే. గత ఆరు నెలలుగా కురిసిన వర్షాలకు బీటీ రోడ్డు దారుణంగా దెబ్బతింది. ఈ దారిలో ద్విచక్ర వాహనాలు కాదు కదా కనీసం నడిచి వెళ్లలేని దుస్థితి. భారీ వాహనాలు ఎన్నోసార్లు ఇరుక్కుపోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ మార్గంలోనే తాతిరెడ్డిపల్లె, కె.బొంతపల్లె గ్రామస్తులు కూడా ప్రయాణిస్తూ నిత్యం యాతన అనుభవిస్తున్నారు. అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మించాలని మూడు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



గనివానిపాడులో ఓ వీధిలో వర్షం నీరు



అధ్వానంగా వాగుమడుగు వెళ్లే రహదారి

సగిలేరును పరిశీలించిన సబ్ కలెక్టర్

గిద్దలూరు రూరల్: అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో నల్లమలలో విస్తారంగా వర్షాలు కురిసిన నేపథ్యంలో సగిలేరులో వరద ఉధృతిని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ గురువారం పరిశీలించారు. నంద్యాల రోడ్డులోని సగిలేరు బ్రిడ్జి, కొండపేట ఆంజనేయ స్వామి ఆలయం వద్ద బ్రిడ్జి, కేఎస్ పల్లె సమీపంలో సగిలేరు బ్రిడ్జిల వద్ద వరదపై అధికారులతో చర్చించారు. సగిలేరు పరిసర ప్రాంత ప్రజలకు అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ముందుగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంతోపాటు పాత తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని సబ్ కలెక్టర్ పరిశీలించారు. కార్యాలయ సిబ్బంది పేర్లు, హోదా కనపడేలా బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి, సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది సుబ్బారావు, వీఆర్‌ఓలు వై.పి.రంగయ్య, ఆంజనేయులు, నాగేంద్ర, ఇరిగేషన్ శాఖ అధికారులు ఉన్నారు.



సగిలేరు వాగును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



కేఎస్ పల్లెలో వాల్మీకి విగ్రహానికి భక్తుల పూజలు



వాల్మీకి మహర్షికి పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

మార్కాపురం: వాల్మీకి మహర్షి జయంతిని గురువారం తర్లుపాడు రోడ్డులోని విద్యుత్ కార్యాలయం వద్ద ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ప్రపంచానికి రామాయణం లాంటి అద్భుత గ్రంథాన్ని అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మద్దెల లక్ష్మీ, ఏవీ సుబ్బారావు, ఎం.వాసవీప్రియ తదితరులు పాల్గొన్నారు. స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ జీవీ శివారెడ్డి ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: మహర్షి వాల్మీకి జయంతిని కేఎస్ పల్లె బీసీ కాలనిలోని ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి విగ్రహం వద్ద భక్తులు పూజలు చేశారు. వాల్మీకి జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని నిర్వాహకులు శ్రీను సూచించారు. పట్టణంలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు అవశ్యం



తర్లుపాడు : మిర్చి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీ నాయక్, హెచ్ఓ, ఏఓ

● రైతులకు వ్యవసాయాధికారుల సూచన

బేస్తవారిపేట: వర్షం నీరు నిల్వ ఉన్న మిరప పంటకు లీటరు నీటికి 10 గ్రాముల యూరియా, 10 గ్రాముల పంచదార కలిపిన ద్రావణాన్ని వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని ఉద్యానశాఖ అధికారిణి డి.శ్వేత సూచించారు. గురువారం పూసలపాడు, చెట్టిచర్లలో మిరప పంటలను ఆమె పరిశీలించారు. మొక్కలు వడలి తలలు వాల్చినప్పుడు లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని సూచించారు. కాపుతో ఉండి వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని నింపాలని, ఎకరానికి 30 కిలోల యూరియా, 15 కేజీల పొటాష్, 25 కిలోల వేపపిండి వేయాలని చెప్పారు. ఆకుమచ్చ తెగులు నివారణకు 10 లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్‌ఆక్సీక్లోరైడ్, గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ విస్తరణాధికారి వైసీహెచ్ శేషగిరి, వీఏఏలు నవీన్, రసూల్ పాల్గొన్నారు.

శనగ రైతులు జాగ్రత్తలు పాటించాలి

కొమరోలు: శనగ పంటలో ఎండు తెగులు నివారించడానికి కిలో విత్తనాలను 5 గ్రాముల ట్రైకోడెర్మావిరిడితో విత్తన శుద్ధి చేసుకోవాలని ఏఓ రాజశ్రీ సూచించారు. మండలంలోని పామూరుపల్లి, అల్లినగరం గ్రామాల్లో శనగ రైతులకు సాగుపై అవగాహన కల్పించారు.

పొలాల్లో వర్షం నీరు బయటకు పంపాలి

రాచర్ల: పంట పొలాల్లో వర్షం నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ఏఓ షేక్.అబ్దుల్ రఫీక్ సూచించారు. మండలంలోని గంగంపల్లె, ఆరవీటికోట గ్రామాల్లో పంట పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. భూమిలో అధిక తేమ ఉండటం వల్ల మొక్కలు వేర్ల ద్వారా పోషకాలు గ్రహించలేవని, పైపాటుగా 19-19-19 లేదా 13-0-45 ఎకరానికి రెండు కేజీలు పిచికారీ చేయాలని సూచించారు. శనగ విత్తనాలకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఈఓ బి.సంపత్‌కుమార్, వీఏఏలు మధుశంకర్, పి.లక్ష్మి పాల్గొన్నారు.



కొమరోలు : రైతులతో మాట్లాడుతున్న ఏఓ రాజశ్రీ



రాచర్ల : రైతులకు సూచనలిస్తున్న ఏఓ అబుద్ల్ రఫీక్

తర్లుపాడు: గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని తర్లుపాడు, సీతానాగులవరం, రోలుగంపాడు గ్రామాల్లో దెబ్బతిన్న పత్తి, మిర్చి పంటలను ఏడీఏ బాలాజీ నాయక్ గురువారం పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ.. వర్షాల వల్ల మొక్కల పెరుగుదల తక్కువగా ఉంటుందని, ఈ నేపథ్యంలో ఎకరాకు 50 కిలోల యూరియా, 25 కిలోల పోటాష్ వేయాలని సూచించారు. వీలుకాని పక్షంలో మల్టీ–కే పిచికారీ చేస్తే పోషకాలు అంది పంట త్వరగా కోలుకుంటుందని వివరించారు. హెచ్ఓ రమేష్ మాట్లాడుతూ.. మిరపలో తేమశాతం ఎక్కువగా ఉన్నందున పొటాషియం నైట్రేట్ ఒక శాతం ద్రావణాన్ని (లీటర్ నీటికి 13-0-14 మందు 10 గ్రాములు) పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు. ఏఓ వెంకటేశ్వర్లు, వీఏఏలు పూర్ణ శంకర్, బాబు పాల్గొన్నారు.



బేస్తవారిపేట : రైతులకు సూచనలిస్తున్న హెచ్ఓ శ్వేత


అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం



కొండాయపాలెంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పొదిలి రూరల్: గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో చేపట్టాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచించారు. గురువారం పొదిలి మండలంలోని కొండాయపాలెం, కుంచేపల్లి, ఈగలపాడు పంచాయతీల్లో ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొండాయపాలెంలో పంటలును పరిశీలించారు. మండలంలో గత నాలుగు రోజులు కురిసిన వర్షాలకు 1250 ఎకరాల్లో సజ్జ పంటకు నష్టం వాటిల్లినట్లు ఎమ్మెల్యేకు వ్యవసాయాధికారులు వివరించారు.

ప్రభుత్వ భవనాల సముదాయంలో సర్పాలు



వెలుగు కార్యాలయం ముందు సంచరిస్తున్న పాము



పామును చంపుతున్న కార్యాలయ సిబ్బంది

● భయాందోళనలో అధికారులు, సిబ్బంది

కొమరోలు: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో విష సర్పాలు సంచరిస్తుండడంతో అధికారులు, సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. గత 4 రోజులుగా కురుస్తున్న వర్షాలు గురువారానికి తగ్గుముఖం పట్టాయి. అయితే వర్షాల ధాటికి బయటకు వచ్చిన పాములు, తేళ్లు రెవెన్యూ, మండల పరిషత్, వెలుగు, హౌసింగ్, ఐసీడీఎస్ కార్యాలయాల ఆవరణలో సంచరిస్తున్నాయి. ఊరి శివారులో ఉన్న కార్యాలయాల చుట్టూ చిల్లచెట్లు దట్టంగా పెరగడంతో గురువారం 6 పాములు రాగా సిబ్బంది వాటిని చంపేశారు.

మూడో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘంలో అక్రమ తొలగింపును నిరసిస్తూ కాంట్రాక్టు ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారంతో మూడో రోజుకు చేరింది. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రిలే దీక్షను సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ ప్రారంభించి మాట్లాడారు. మున్సిపల్ అధికారులు మొండి వైఖరిని వీడకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. గత 25 ఏళ్లుగా సేవలందిస్తున్న సిబ్బందిని అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అకారణంగా తొలగించడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. అధికారులు చట్టబద్ధంగా తమ విధులు నిర్వహించాలని, నిబంధనలు పాటించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. నిరసన కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు కె.సుబ్బరాయుడు, రమణ, సలాంఖాన్, శేషిరెడ్డి, యుసఫ్, అల్లూరయ్య, సుబ్బారెడ్డి, చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులు